
ఆంధ్రజ్యోతి ***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 20 అక్టోబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.154	230	260
సూర్యాపేట	రూ.145	240	250
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 23.0

కొత్త పంతులమ్మ అందరికీ పాఠం నేర్పారు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ప్రచారం చేసినప్పుడల్లా అక్కడ పనిచేసే ఉపాధ్యాయులే వారి పిల్లలను ప్రభుత్వ బడుల్లో ఎందుకు చదివించడం లేదనే ప్రశ్న ఎదురవుతోంది. కారణాలేవైనా.. వీటన్నింటికీ కొత్తగా ఉద్యోగంలో చేరిన ఓ మహిళా ఉపాధ్యాయురాలు తిరుగులేని సమాధానం చెప్పారు. తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి అందరికీ పాఠం నేర్పారు. జిల్లాలో డీఎస్సీ-2024లో ఎస్టీటీ విభాగంలో 13వ ర్యాంక్ సాధించిన కె.నీరజ, జిల్లా కేంద్రంలోని ఎంకేవీ పద్మానగర్ ప్రభుత్వ పాఠశాలలో మొదటి నియామకం పొందగా, అక్కడే తన ఇద్దరు పిల్లలను చేర్పించి ఆదర్శంగా నిలిచారు.

ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ



నింగిలో విరబూసిన సింగిడి



అకాశంలో అద్భుతం ఆవిష్కృతమైంది. శనివారం సాయంత్రం 4.15 నుంచి 5గంటల వరకు కురిసిన వర్షానికి నింగిలో సింగిడి విరిసింది. సంధ్యవేళ ఆకాశం ఎరుపు రంగులోకి మారింది. హరివిల్లుతో నింగి వర్ణశోభితమైంది. జిల్లా వ్యాప్తంగా ఈ దృశ్యం కనువిందు చేసింది.

ట్రెండ్ మారింది



అందం, ఆకర్షణీయ రూపంపై మగువల్లోనే కాదు మగాళ్లలోనూ ఆసక్తి పెరిగింది. హుందాగానే కాదు అందంగానూ కనిపించేందుకు మెరుగులుదిద్దుకోవడం సర్వసాధారణమైంది. పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లే కాదు సమావేశాల్లో సైతం ఆకర్షణగా కనిపించేలా, సెంటరాఫ్ అట్రాక్షన్‌గా ఉండేలా అతివలే కాదు పురుషులూ పోటీపడుతున్నారు. దీంతో మహిళా బ్యూటీపార్లర్లకేగాక, పురుషుల కోసం ఉద్దేశించిన మెన్స్‌పార్లర్లు, మల్టీనేషనల్, చైన్ సంస్థలు నిర్వహించే సెలూన్స్ నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి, మిర్యాలగూడ, కోదాడ వంటి పట్టణాల్లో సైతం అందుబాటులోకి వచ్చాయి. గతంతో పోల్చితే ఇప్పుడు అందం, సౌందర్యరక్షణ, ఆకర్షణీయమైన రూపంపై ఆసక్తి అందరిలో పెరిగింది. దీంతో మారుమూల మండల కేంద్రాల్లో సైతం బ్యూటీపార్లర్లు ఏర్పాటుచేస్తుండగా, మారిన ట్రెండ్‌కు ఇవి అద్దంపడుతున్నాయి.

ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

- బ్యూటీపార్లర్లు, మెన్‌సెలూన్లకు ఫుల్ డిమాండ్
- మగువలే కాదు మగాళ్లలోనూ పెరిగిన ఆసక్తి
- మారుమూలలకూ విస్తరించిన బ్యూటీ కల్చర్
- మోడ్రన్‌లుక్‌పై పెరిగిన ఇంట్రెస్ట్
- పార్లర్ల నిర్వహణతో ఉపాధి మెరుగైందంటున్న నిర్వాహకులు

గత 15 ఏళ్లతో పోల్చుకుంటే పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా అందం, చర్మ సౌందర్యంపై శ్రద్ధ పెరిగిందంటున్నారు బ్యూటీషియన్లు. గతంలో పట్టణాల్లో అతి కొద్దిమంది మాత్రమే పార్లర్లకు వచ్చి ఐబ్రోస్, ఫేషియల్ చేయించుకునేవారని, ఇప్పుడు పూర్తిగా పరిస్థితి మారిపోయిందని అంటున్నారు. ఫంక్షన్లు, పండగలు, వివాహాల సందర్భాల్లోనే పదేళ్ల క్రితం వరకు ప్రత్యేక అలంకరణలకు ప్రాధాన్యమిచ్చేవారని, ఇప్పుడు రెగ్యులర్‌గా అందాన్ని సంరక్షించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెబుతున్నారు. గతంలో 10శాతం మంది మహిళలు, యువతులు మాత్రం పార్లర్లకి వస్తే ఇప్పుడు 80శాతం మందికిపైగా మహిళలు పార్లర్లను వినియోగించుకుంటున్నారు. నల్లగొండ వంటి పట్టణంలో 15 ఏళ్ల క్రితం పట్టుమని పది బ్యూటీపార్లర్లు కూడా నడిచేవి కావు. ఇప్పుడు గల్లీ గల్లీలో బ్యూటీపార్లర్లు విజయవంతంగా కొనసాగుతున్నాయి. మహిళల్లో వచ్చిన చైతన్యం, అందంతో పాటు, ఆరోగ్య, చర్మ సంరక్షణపై పెరిగిన అవగాహనే అందుకు కారణం. ఆధునిక జీవనశైలికి అనుగుణంగా మారుతున్న ట్రెండ్స్‌ను పట్టణ మహిళలు అందుకుంటున్నారు.

సౌందర్యాన్నిచ్చే కేంద్రాలుగా బ్యూటీపార్లర్లు

బ్యూటీపార్లర్లంటే ఫేషియల్, ఐబ్రోస్, పెళ్లికూతురు మేకప్ వంటి వాటితోనే సరిపుచ్చడం లేదు. వినియోగదారులు డబ్బుకు వెరవకుండా ఖర్చు చేస్తుండడంతో అంతే స్థాయిలో బెంగుళూరు, హైదరాబాద్ వంటి మహానగరాల్లో లభించే సదుపాయాలు, సేవలు పట్టణాల్లో కూడా లభిస్తున్నాయి. కేశాలంకరణ మొదలు ఫేషియల్, ఐబ్రోస్, హెన్నా, వాక్సిన్, హెయిర్‌కట్, పెడిక్యూర్, మెనిక్యూర్, బాడీమసాజ్, స్పా, పెళ్లికూతురు మేకప్, పెళ్లిళ్ల, పండగల సందర్భంగా మేకప్స్, హెయిర్ స్టైల్స్ చేయించుకోవడం సర్వసాధారణంగా మారింది. ఈ సేవలన్నీ స్థానిక బ్యూటీపార్లర్లలోనే లభిస్తుండడంతో గిరాకీ పెరిగింది. ఆధునిక ట్రెండ్స్‌ను అందరికీ అందుబాటులోకి తెస్తూ బ్యూటీపార్లర్లు అడ్వాన్స్ బ్యూటీ ప్రొడక్ట్స్‌ను వినియోగిస్తున్నాయి.

మేమూ సైతం అంటున్న పురుషులు

ముందుతరాల్లో సినిమా నటులు, ఉన్నతవర్గాల పురుషులు మాత్రమే అందం, ఆకర్షణీయమైన రూపంపై శ్రద్ధ కనబరిచేవారు. ఇప్పుడు ట్రెండ్ పూర్తిగా మారిపోయింది. గతంలో పురుషులు కేవలం హెయిర్‌స్టైల్,

మిగతా 7వ పేజీలో...



సంధ్య

● అందంగా, ఆకర్షణీయంగా ఉండేందుకు ప్రాధాన్యం

మహిళలు, యువతులు ఇప్పుడు అందంగా ఉండడానికి, ఆకర్షణీయంగా ఉండడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అందాన్ని కాపాడుకునేందుకు, సౌందర్యాన్ని పెంచుకునేందుకు వెనకాడడం లేదు. కేవలం పెళ్లిళ్లకు, ఇతర ఫంక్షన్లకు వెళ్లేటప్పుడే కాకుండా రెగ్యులర్‌గా కూడా అందంగా ఉండేలా చూసుకుంటున్నారు. అందుకోసం పార్లర్లల్లో ఐబ్రోస్ మొదలుకొని పెడిక్యూర్ వరకు అవసరమైన సేవలను పొందుతున్నారు. ఫ్యాషనబుల్‌గా, మోడ్రన్‌గా ఉండేందుకు మొహమాటపడని తరం ఇప్పుడు కొనసాగుతోంది. బ్యూటీపార్లర్లు విజయంతంగా నడిచేందుకు ఇదే ప్రధాన కారణం. పార్లర్ల నిర్వహణతో మాకు కూడా మంచి ఆదాయం రావడమే కాదు, కస్టమర్లకు నాణ్యమైన సేవలు, నమ్మకంగా అందిస్తున్నాం.

వరంగంటి సంధ్య, సంధ్య హెర్బల్ బ్యూటీపార్లర్, నల్లగొండ




ఎంజీయూలో అన్నీ సమస్యలే

- అభివృద్ధికి విడుదల కానీ నిధులు
- పర్మినెంట్ ఫ్యాకల్టీ లేక కుంటుపడుతున్న విద్యాబోధన
- అవుట్ సోర్సింగ్ సిబ్బందితోనే గడుపుతున్న అధికారులు
- కొత్త కోర్సుల ప్రారంభాన్ని పట్టించుకోని వైనం
- మరొకసారి బాధ్యతలు చేపట్టిన వీసీకి సమస్యల సవాళ్లు

మహాత్మా గాంధీ యూనివర్సిటీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. యూనివర్సిటీ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు గెస్ట్ ఫ్యాకల్టీతోనే బోధనను నెట్టుకొస్తున్నారు. మొత్తం 165 మంది ప్రొఫెసర్ల నియామకం చేపట్టాల్సి ఉండగా, కేవలం 40మందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియమించి బోధన చేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు తప్ప పదేళ్ల కాలంలో యూనివర్సిటీ అభివృద్ధికి ఒక్క పైసా కూడా విడుదలకాలేదు.

●6లో..



వీసీగా బాధ్యతలు తీసుకున్న అల్తాఫ్‌హుస్సేన్



ఉరుమడ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్‌వో వెంకటేశ్వర్లు

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు 243 కేంద్రాలు ప్రారంభం

- సన్నరకం ధాన్యం కోసం 42 కేంద్రాలు
- పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు

చిట్యాలరూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకు జిల్లా వ్యాప్తంగా 325 కేంద్రాలకు 243 ప్రారంభించినట్టు పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని వట్టిమర్తి, ఉరుమడ్ల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు దూరప్రాంతంలో కాకుండా రైతులకు అనువైన ప్రతీ గ్రామంలో ఏర్పాటుచేశామన్నారు. ఇబ్బందుల్లేకుండా రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. జిల్లాలో 243 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. సన్నరకం ధాన్యాన్ని సాగుచేసిన రైతుల సౌలభ్యం కోసం ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 42 కేంద్రాల్లో సన్న రకం ధాన్యం కొనుగోలుచేస్తున్నట్టు తెలిపారు. సన్న రకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తోందన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, దళారులు, ప్రైవేటు వ్యక్తులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సుంకరి మల్లేష్ గౌడ్, పాలకవర్గ సభ్యులు, అధికారులు, పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు

మిర్యాలగూడ వ్యవసాయం, 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పురుగు మందుల దుకాణాల్లో రెండు రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు జేడీఏ శ్రవణ్‌కుమార్ తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మిర్యాలగూడలో నకిలీ మందులు పట్టుబడటంతో అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. నాసిరకం మందులు విక్రయించి రైతులను మోసం చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కేతేపల్లి మండలం సుదివాడ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షం

- నేలవాలిన వరి పొలాలు
- పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- పిడుగుపాటుకు మహిళ మృతి

●7లో..

టెలీమెట్రీలను పరిశీలించిన సీడబ్ల్యూసీ సీఈ

●7లో..



యాదగిరిగుట్టలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు

ఉర్సులో అలరించిన ఖవ్వాలి



జిల్లా కేంద్రంలో లతీఫుల్లా షాఖాద్రి ఉర్సులో ఖవ్వాలీ ఆలపిస్తున్న పర్వీన్‌సుల్తానా బృందం

ఆనంద పరవశులైన భక్తులు

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గుట్టమెట్ల వద్ద నిర్వహించిన ఖవ్వాలి భక్తులను అలరించింది. ఔరంగాబాద్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అఖిల్, షకీల్‌నార్సీ, పర్వీన్‌సుల్తానా బృందం పాడిన ఖవ్వాలీలు భక్తులను ఆనంద పరవశులను చేశాయి. కళాకారుల పాటలకు పరవశించిన కొందరు భక్తులు నృత్యాలు చేశారు. లతీఫుల్లా షా ఖాద్రిపై చేసిన కీర్తనలు ఆకట్టుకున్నాయి. భక్తులు ఖవ్వాలికి అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆదివారం తెల్లవారుజాము వరకు ఈ ఖవ్వాలి కొనసాగింది. కార్యక్రమంలో దర్గా ముతవళ్లులు నమీ ఉల్లా ఖాద్రి, గౌస్ ఉల్లా ఖాద్రి, సల్మాన్‌ఖాద్రి, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలపై దాడులను అరికట్టాలి

బజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ నరసింహ

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలపై ఉగ్రవాద దాడులను వెంటనే అరికట్టాలని బజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ నరసింహ డిమాండ్ చేశారు. దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రామగిరి రామాలయం నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ, హిందుత్వంపై దాడి జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే దేవాలయాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. దేవాదాయ ఆస్తులు, దేవుడి హుండిపై కన్ను వేసిన దేవాదాయశాఖ, దేవుడి భద్రత, పవిత్రత విషయంలో చేతులెత్తేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ఉగ్రవాదులను పసిగట్టి కఠినంగా శిక్షించాలని కోరారు. ర్యాలీ బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ జిల్లా కో-కన్వీనర్ కన్నెబోయిన వెంకట్, వీహెచ్‌పీ జిల్లా సహాయకార్యదర్శి జూకురి సంపత్ వర్మ, పట్టణ అధ్యక్షుడు రాయల కృష్ణయ్య, ధర్మచార ప్రముఖ్ ఉంద్యాల ప్రకాశ్‌రెడ్డి, మాలోతు శ్రీనివాస్, సాత్విక్, హరికిశోర్, ప్రభాకర్, సంతోష్, వెంకట్, మాతంగి అమర్, నరేష్, బీజేపీ నాయకులు శ్రీదేవి, స్రవంతి, కాశమ్మ, నిరజ, విజయ్, తారానాయక్, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు

మంచు పొగలా



అగ్ని పర్వతం బద్దలైందా అన్నట్లు ఉన్న ఈ దృశ్యం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రం నుంచి మాండ్రకు వెళ్లే దారిలోనిది. తొలిమంచుతెరలు కొండరాళ్లను ఢీకొని పైకెగసి వెళ్తూ ఇలా అగ్నిపర్వతాన్ని తలపించింది.

నివాసాల్లో చోరీలకు పాల్పడిన దొంగల అరెస్టు

సూర్యాపేటక్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసి ఉన్న నివాసాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను సూర్యాపేట జిల్లా కేంద్ర పోలీసులు అరెస్ట్‌చేశారు. వారి నుంచి మూడు తులాల బంగారు ఆభరణాలు, 35 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట డీఎస్పీ రవి శనివారం రాత్రి సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సూర్యాపేటలోని చంద్రన్నకుంటకు చెందిన పాతనేరస్తుడు సుతారీ పనిచేసే గంపల శ్యాం, చివ్వెంల మండలం గుంజలూరుకు చెందిన లారీ క్లీనర్ రెడపంగు వీరబాబులు కొన్నినెలల క్రితం నల్లగొండ జైలులో పరిచయయ్యారు. శ్యాం సూర్యాపేటలో ఓ చోరీ కేసులో పట్టుబడగా, వీరబాబు హుజూర్‌నగర్ పరిధిలో పోక్సో కేసులో జైలుకు వెళ్లాడు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు జైలు నుంచి విడుదలయ్యాక నివాసాల్లో చోరీలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా సెప్టెంబరులో విడుదల కాగానే సూర్యాపేటలో ఓ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

గదిని అద్దెకు తీసుకున్నారు. సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 14వ తేదీ వరకు సూర్యాపేటలోని నాలుగు నివాసాలు, చివ్వెంల మండలంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. అయితే కొన్నినెలలుగా తరచుగా సూర్యాపేట ప్రాంతంలో చోరీలు ఎక్కువగా జరుగుతుండడంతో చోరీలపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించడంతో నివాసాల్లో విలువైన వెండి, బంగారు ఆభరణాలు పెద్దమొత్తంలో భద్రపరచలేదు. దీంతో నిందితులు ఐదు నివాసాల్లో చోరీలకు పాల్పడినా కేవలం మూడు తులాల బంగారు ఆభరణాలు, 35 తులాల వెండి వస్తువులు మాత్రమే చోరీ చేయగలిగారు. నిందితులు చోరీ చేసిన సొత్తును శనివారం సూర్యాపేటలో విక్రయించేందుకు వెళ్తుండగా కొత్తబస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి చోరీ చేసిన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం విచారించగా సూర్యాపేటలో నాలుగు, చివ్వెంల మండలంలో ఒక ఇంట్లో చోరీ చేసినట్లు అంగీకరించారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. గంపల శ్యాంపై 10 చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు.సమావేశంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ గురుకుల రాజశేఖర్, పట్టణ ఎస్ఐలు బాల్నె కుశలవ, గోపిక్రిష్ణ, సిబ్బంది క్రిష్ణయ్య, గోదేశి కర్ణాకర్, జోగు సైదులు, శివ, చీకూరి మధు ఉన్నారు.

జనగామను పాపన్న జిల్లాగా మార్చాలి

నార్కట్‌పల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా పేరును పాపన్న జిల్లాగా మార్చాలని గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల శ్రీ నూతన గౌడ సంఘం ఏర్పాటు చేసిన సందర్భంగా టీపీసీసీ నూతన అధ్యక్షుడు మహే‌ష్‌కుమార్‌గౌడ్‌ను శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గోల్కొండ కోటను ఏలిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని గోల్కొండ కోటలో ప్రతిష్ఠించాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించి హైబ్రీడ్ తాటి, ఈత, ఖర్జూర వనాలను పెంచాలని పేర్కొన్నారు. ఎన్నో ఔషధ గుణాలు ఉన్నా తాటికల్లును ఉస్మానియా యూనివర్సిటీ ప్రయోగాత్మకంగా నిర్ధారించినందున కల్లు తాగడం ఆరోగ్యానికి మంచిదనేలా ప్రభుత్వమే



టీపీసీసీ అధ్యక్షుడు మహే‌ష్‌కుమార్‌ను సన్మానిస్తున్న మామిడి రామకృష్ణ, ఇతరులు


ప్రచారం చేయాలని అన్నారు. కాటమయ్య రక్షణ కవచాన్ని ప్రతీ గీత కార్మికునికి అందజేసేలా ప్రభుత్వం చొరవ చూపేందుకు కృషి చేయాలని కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మహే‌ష్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోరిగాడి ఉపేందర్, నాతి రాజేందర్, ప్రధాన కార్యదర్శి బత్తుల రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మిట్టపల్లి విజయ్, సలహాదారు ముద్దగోని రామ్మోహన్, అధికార ప్రతినిధి బండమీది కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరికైనా వారి పనుల వల్ల పేరొస్తుంది.
అలా వారి ప్రవృతులను బట్టి పిలుస్తుంటాం..
అయితే స్రవంతిని ఏమని పిలవాలి..
పాటలు పాడుతుంది కాబట్టి
గాయని అందమా?
పాటలు రాస్తుందీ రైటర్ అందామా?
రాయడంతో పాటు పాడుతుంది కాబట్టి
వాగ్గేయకారిణి అందామా?
టీవీ షోలూ చేసింది యాంకర్ అందామా?
కావ్యాలు, పుస్తకాలు రాసిందీ..
రచయిత అందామా?
పాఠాలూ బోధిస్తుంది.. టీచర్ అందామా?
ఇన్ని కళల 'మేఘా' కలయికే 'స్రవంతి'..
ఆమె ప్రతిభ పాదరసం.. ఏ రంగంలోకి వెళితే
అక్కడ ప్రతిభను చాటుకోవడం ఆమె నైజం.
చదువు, ఉద్యోగం ఏదేని ఒక్క రంగంతోనే
సరిపెట్టుకుంటన్న యువతులకు ఓ చక్కటి
ఉదాహరణ స్రవంతి... అన్ని రంగాల్లో
ఆమె ప్రస్థానాన్ని ఓసారి తెలుసు
కుందాం..



ఏ 'స్రవంతి'లో అయినా రాణిస్తూ

మఠంపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలకేంద్రానికి చెందిన ఉండేటి స్రవంతికి చిన్నతనం నుంచే పాటలు పాడటమంటే ఇష్టం. తండ్రి ప్రభు చక్కని గాయకుడు అయినా తన ప్రతిభను ఎక్కడా ప్రదర్శించేవాడు కాదు. కానీ కుమార్తెకు పాటలు నేర్పించేవాడు. మఠంపల్లిలో స్రవంతి రెండో తరగతి చదువు తున్నప్పుడు తండ్రి నేర్పించిన తమిళం పాట పాఠశాలలో పాడింది. అంతే ఇక అప్పటినుంచి ఎప్పుడు పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నా స్రవంతి పాట ఉండాల్సిందే అన్నట్లుగా ఆకర్షితులయ్యారు విద్యార్థులు.



'వందేమాతరం' స్రవంతి మొదలై..

స్రవంతి స్వరం నచ్చి ప్రతి రోజూ వందేమాతరం పాడించేవారు. అలా 10వ తరగతి వరకు ఆమె వందేమాతరం పాడుతుండేది. ఓ రోజు ఆమె పాఠశాలకు వెళ్లలేదు.ఆ రోజు వందేమాతరం స్రవంతి రాలేదా? అని ఓ టీచర్ అడిగింది. అంతే అప్పటి నుంచి ఆమెను 'వందేమాతరం స్రవంతి' అని పిలవడం మొదలుపెట్టారు. డిగ్రీ కోసం హుజూర్‌నగర్‌కు వెళ్లిన ఆమె అక్కడే దూళిపాళ శ్రీనివాసరావు దగ్గర సంగీతాన్ని నేర్చుకుంది. ఆయన వెంట కచేరీలకు వెళ్లి ప్రదర్శనలు ఇస్తుండేది. 2008లో నల్లగొండలో చిన్నిచరణ్(ప్రస్తుతం చరణ్ అర్జున్‌గా ప్రసిద్ధి) నిర్వహించిన పోటీల్లోనూ ఆమె ఎంపికైంది. 2010లో 'పాడుతా తీయగా' ప్రోగ్రామ్‌కు జిల్లా నుంచి ఎంపికైన ఇద్దరిలో స్రవంతి ఒకరు. ఆ కార్యక్రమంలో పలు పాటలు పాడి ప్రముఖ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం నుంచి ప్రశంసలు అందుకుంది.



నవ్వు నవ్వించు కార్యక్రమంలో వ్యాఖ్యాతగా స్రవంతి

మలుపు తిప్పిన వరల్డ్‌కప్

2011లో జరిగిన క్రికెట్ వరల్డ్ కప్‌లో క్వార్టర్ ఫైనల్‌కు ఇండియా ఇండియా చేరింది. ఆ సమయంలో జట్టు విజయాన్ని కాంక్షిస్తూ స్రవంతి రాసిన పాటను మ్యూజిక్ డైరెక్టర్ మధు కొన్నూరు ఆధ్వర్యంలో గాయకులు అనుదీప్, పృధ్వీచరణ్‌లతో పాడించి అల్బమ్ తీసుకువచ్చింది. ఇండియా వరల్డ్‌కప్ గెలవడంతో అన్ని న్యూస్‌ఛానళ్లలో ఆ పాటను టెలికాస్ట్ చేశారు. దీంతో స్రవంతి పేరు అల్బమ్ చేసే రంగాల్లోని కళాకారుల అందరి దృష్టిలో పడింది. తొలి తెలుగు వరల్డ్ కప్ అల్బమ్‌గా అవార్డును కూడా స్రవంతి దక్కించుకుంది. ఆ తర్వాత 2014లో హిందీ, ఇంగ్లీష్‌లలో పలు అల్బమ్‌లలో పాటలు పడింది. ఇంగ్లీష్ గాయని బీయాన్ సీ పాటలను ఇక్కడికి అనుగుణంగా పాడి విడుదల చేసింది. 2014లో 'మేఘ స్రవంతి' పేరిట య్యూట్యూబ్‌లో మ్యుజిక్ ఛానెల్‌ను ప్రారంభించింది.

టీవీ రంగంలోకి

హైదరాబాద్‌లోనే ఉంటూ పాటలు రాస్తూ, పాడు తున్న స్రవంతి 2015లో టీవీ రంగంలోకి ప్రవేశించింది. ఓ న్యూస్ ఛానెల్‌లో వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌గా చేరి, యాంకర్ స్థాయికి ఎదిగింది. 2016లో రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ఛానెల్ యాదగిరిలో యాంకర్‌గా చేరి 'నవ్వు నవ్వించు' కార్యక్రమానికి వ్యాఖ్యాత, రచయిత, నిర్వాహకురాలిగా చేసింది. ఇదిలా ఉండగా 2017లో నిర్వహించిన గురుకుల పరీక్షల్లో జోన్ స్థాయి 5వ ర్యాంక్ సాధించి ప్రస్తుతం హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టలోని గురుకుల డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

సినిమాల్లోనూ..

పాటలు రాస్తూ, పాడుతూ అల్బమ్స్‌ను తీసుకురావడంతో పాటు సినిమా రంగంవైపు ఆమె ప్రయత్నించింది. ఈ క్రమంలో 2017లో రాజ్‌తరుణ్, హెబ్బాపటేల్ హీరోహీరోయిన్లుగా నటించిన 'అందగాడు' సినిమాలో 'ప్రేమిక' పాటకు అవకాశం లభించింది. ఆ తర్వాత అదీ లెక్క, రాణిగారి బంగ్లా, పోలీస్‌పవర్, హంతకుడుతో పాటు సినిమాల్లో పాటలుపాడింది. 2017లో శేఖర్ కమ్ముల ఫిదా చిత్రంలో ఆర్‌ఆర్(బ్యాగ్రౌండ్‌లో చిన్న వ్యాఖ్యలు)కు పనిచేసింది.

రచయితగా మొదటి శతకం

2021లో 'అనాది అనాథ శతకం' పేరుతో పుస్తకాన్ని ప్రచురించింది. ఆ పుస్తకాన్ని తమ్ముడు పవన్‌కు అంకితమిచ్చింది. ఆమె రాసిన 'మేఘ స్రవంతి' కవితా సంపుటికి డాక్టర్ సి నారాయణరెడ్డి ముందుమాట రాశారు. ఎవరూ పరిశోధన చేయని భక్తి సంప్రదాయ కీర్తనాకారులైన దాసుల సాహిత్యాన్ని స్పృశిస్తూ 'తెలంగాణ దాస సాహిత్యం' అనే అంశంపై పరిశోధన చేశారు. ఇందుకుగాను ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టాను అందజేసింది.

నూతనంగా ఆలోచించడమే విజయ రహస్యం



ఏ రంగంలోనైనా నూతనంగా ఆలోచిస్తా. సృజనాత్మతకు పెద్దపీట వేస్తా. నిత్యవిద్యార్థిగా ప్రయత్నిస్తుంటా. అందువల్లే విభిన్న రంగాల్లో రాణిస్తున్నా. చిన్నతనంలో నాన్న, పెళ్లయ్యాక నా భర్త వినయ్‌కుమార్ ప్రోత్సాహం ఎంతో ఉంది. ఏ రంగంలో అయినా ప్రయత్నం లోపం లేకుంటే విజయానికి సాధ్యమే.

- మేఘ స్రవంతి

ఎంజీయూలో అన్నీ సమస్యలే

● అభివృద్ధికి విడుదల కానీ నిధులు
● పర్మినెంట్ ఫ్యాకల్టీ లేక కుంటుపడుతున్న విద్యాబోధన

నల్లగొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ)లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విద్యారంగాన్ని అభివృద్ధి చేయడం కోసం యూనివర్సిటీని ఏర్పాటు చేసినప్పటికీ అందులో మెరుగైన పరిస్థితులు కానరావడం లేదు. ఉన్నత విద్యను, ప్రత్యేక కోర్సులను అందించడం కోసం యూనివర్సిటీ ఏర్పాటు అయినప్పటికీ పర్మినెంట్ లేకుండా అవుట్ సోర్సింగ్ సిబ్బందితోనే నడుపుతున్నారు. పలుమార్లు వివాదాస్పద నిర్ణయాలకు కేంద్ర బిందువుగా మారిన ఎంజీయూలో ఏ మాత్రం మార్పు రాలేదన్నది జగమెరిగిన సత్యం. వందలాది ఎకరాల్లో యూనివర్సిటీని ఏర్పాటు చేసినప్పటికి అభివృద్ధి మాత్రం నామమాత్రంగానే కనిపిస్తోంది. విద్యార్థిని, విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడంతో పాటు హాస్టళ్లల్లో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా హాస్టల్ వసతులు సరిగా లేవని విద్యార్థులు వాపోతున్నారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల నుంచే కాకుండా తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి సైతం యూనివర్సిటీలో చదువుకోవడానికి విద్యార్థులు వస్తుంటారు. పేరుకే యూనివర్సిటీ అయినప్పటికినీ అందుకు అనుగుణంగా విద్యాబోధనతో పాటు సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

2009 నుంచి గెస్ట్ ఫ్యాకల్టీతోనే...

2009 సంవత్సరం నుంచి గెస్ట్ ఫ్యాకల్టీతోనే విద్యాబోధన జరుగుతోంది. అప్పటి నుంచి ఉన్న కోర్సులు తప్ప కొత్త కోర్సులను ఏర్పాటుచేయని పరిస్థితి ఉంది. అవుట్ సోర్సింగ్ ప్రతిపాదికన కాలం గడుపుతున్న యంత్రాంగం రెగ్యులర్ ఫ్యాకల్టీని ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. యూనివర్సిటీలోని పలు విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లు కూడా లేని పరిస్థితి నెలకొంది. పలు కోర్సులకు పర్మినెంట్ ప్రొఫెసర్లు కూడా లేరు. తెలుగు విభాగానికి సంబంధించి ప్రొఫెసర్లు లేకపోవడంతో అవుట్ సోర్సింగ్ ద్వారానే నడిపే పరిస్థితి ఉంది. మొత్తం 165మంది ప్రొఫెసర్లు అవసరం ఉండగా అవుట్‌సోర్సింగ్ పద్ధతిన కేవలం 40మందితోనే విద్యాబోధన జరుగుతోంది. ఇక 300మంది వరకు నాన్‌టీచింగ్ సిబ్బంది అవసరం ఉండగా నలుగురు మాత్రమే పర్మినెంట్ సిబ్బంది మిగతా 200మంది వరకు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. 2012లో ఒకే ఒక నోటిఫికేషన్ విడుదల చేయగా అప్పట్లో జరిగిన నియామకాలపై అనేక



ఆరోపణలు వెలువడ్డాయి. అయితే వచ్చిన ఆరోపణలపై కొంతమంది ప్రొఫెసర్లు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు స్టే ద్వారా 31మంది యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్నారు. 2013-14 సంవత్సరంలో ఇంజనీరింగ్ కోర్సులు యూనివర్సిటీలో అందుబాటులోకి వచ్చినప్పటికినీ ఆ కోర్సులకు విద్యాబోధన చేయడానికి సరిపడా ఫ్యాకల్టీ లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో సైతం ఐదు, ఆరు కోర్సులకు పరిమితం కావడంతో తమకు కావాల్సిన కోర్సులు లేకపోవడంతో చాలామంది విద్యార్థులు ఎంజీయూలో చేరకుండా ఇతర కళాశాలల్లో చేరుతున్న పరిస్థితులు ఉన్నాయి.

యూనివర్సిటీకి నిధుల కొరత

మహాత్మాగాంధీ యూనివర్సిటీకి నిధుల కొరత తీవ్రంగా ఉంది. అందులో పనిచేస్తున్న ప్రొఫెసర్లకు, సిబ్బందికి జీతభత్యాలు తప్ప పదేళ్లుగా ఒక్క రూపాయి కూడా అభివృద్ధికి నిధులు విడుదల కాకపోవడం గమనార్హం. మొదట్లో రూ.2కోట్లు బడ్జెట్‌లో కేటాయింపులు చేసినప్పటికీ అది కాస్తా కాగితాలకే పరిమితం కావడం తప్ప నిధులు మాత్రం విడుదల కాలేదు. విద్యార్థులు చెల్లిస్తున్న ఫీజులతోనే కాస్తోకూస్తో అభివృద్ధి తప్ప ప్రభుత్వం నుంచి నేరుగా నిధులు చెల్లించకపోవడం గమనార్హం. ఫ్యాకల్టీ కోసం రూ.10కోట్లతో క్వార్టర్స్ నిర్మించినా అవి నిరుపయోగం ఉన్నట్లు సమాచారం. ఫ్యాకల్టీకి క్వార్టర్స్ కేటాయిస్తే వారు అందుబాటులో ఉండే అవకాశాలు ఉంటాయి. యూనివర్సిటీకి నిధులు కొరత తీవ్రంగా ఉండటంతో అభివృద్ధి ఆమడ దూరంలో నిలిచిపోయింది. యూనివర్సిటీల్లో కొత్త కోర్సులు అంటే ఆర్ట్స్ విభాగం సంబంధించి పొలిటికల్ సైన్స్, హిస్టరీ వంటి గ్రూప్‌లు ఏర్పాటు చేయలేకపోతున్నారు. అనేక రకాల కొత్త కోర్సులకు నోటిఫికేషన్ 2009 నుంచి వెలువడకపోవడానికి నిధుల కొరతతే కారణమని విద్యార్థి సంఘాల నాయకుల ఆరోపిస్తున్నారు. ప్రధానంగా కొత్త కోర్సులు ఏర్పాటైతేనే ఎంజీయూపై విద్యార్థులకు ఆసక్తి ఉంటుంది. కానీ పాత కోర్సులతోనే కాలం గడుపుతూ అవుట్‌సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీతో విద్యాబోధన చేస్తూ అదేవిధంగా ఉంటే పరిస్థితి మరింత దిగజారే అవకాశాలు ఉన్నాయి. వాస్తవానికి అయితే పనిచేసే ప్రొఫెసర్లకు నాన్‌టీచింగ్, టీచింగ్ సిబ్బందికి జీతాలు ఇస్తూ విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోకపోవడం వల్లనే యూనివర్సిటీ అభివృద్ధిపై నీలినీడలు అలుముకుంటున్నాయి.

ఎంజీయూ వీసీకి సవాళ్ల స్వాగతం

నూతనంగా వీసీగా బాధ్యతలు స్వీకరించిన అల్తాఫ్ హుస్సేన్‌కు సమస్యలు స్వాగతం పలకడంతో పాటు సవాళ్లుగా మారాయి. ఆయన గతంలో 2016 జూలై నుంచి 2019 జూన్ 29 వరకు ఎంజీయూ వైస్‌ఛాన్సలర్‌గా సేవలు అందించారు. న్యాక్ అక్రిడేషన్‌కు ఆయన నాయకత్వం వహించి బీ-గ్రేడ్ సాధనకు కృషి చేశారు. విశేష అనుభవం కలిగిన అల్తాఫ్ హుస్సేన్‌కు మరోసారి వీసీగా బాధ్యతలు అప్పగించడంతో ఆయన యూనివర్సిటీని మరింత బలోపేతం చేస్తారన్నా ఆశలు చిగురించాయి. మరోసారి బాధ్యతలు చేపట్టిన వీసీ యూనివర్సిటీలో తిష్ట వేసిన సమస్యలను ఏవిధంగా పరిష్కరిస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. యూనివర్సిటీలో ఓ వైపు అభివృద్ధిని పరుగులు పెట్టించడానికి నిధులను సాధించడంతో పాటు ఎంజీయూను రాష్ట్రంలోనే మిగతా యూనివర్సిటీల కంటే మెరుగైన స్థానంలో నిలబడి ఆదర్శంగా ఉండాలంటే విద్యాబోధనను మెరుగుపర్చాల్సి ఉంటుంది. అతిథి అధ్యాపకులు అరకొరగా ఉండటంతో విద్యాబోధనపై ప్రభావం చూపిస్తోంది. విద్యార్థులకు వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు పర్మినెంట్ ఫ్యాకల్టీని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యూనివర్సిటీ అభివృద్ధికి శాయశక్తులా కృషి


● ఎంజీయూ నూతన వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని నూతన వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. శనివారం వీసీ(ఉపకులపతి)గా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధి కోసం ఆచార్యులతో పాటు నాన్‌టీచింగ్, నాల్గో తరగతి ఉద్యోగుల సహకారంతో పాటు ప్రభుత్వం సహకారంతో యూనివర్సిటీని ఉన్నతంగా తీర్చిదిద్దుతానన్నారు. గతంలో 2016 నుంచి 2019 వరకు వీసీగా పనిచేశానని, అప్పుడు కూడా నైపుణ్యాలన్నింటిని ఉపయోగించి యూనివర్సిటీ అభివృద్ధి కోసం శ్రమించానన్నారు. మరొకసారి తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి, జిల్లా మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. యూనివర్సిటీలో మెరుగైన



అధ్యాపకులు, ఉద్యోగులతో చర్చిస్తున్న వీసీ అల్తాఫ్‌హుస్సేన్

ఉన్నతవిద్యకు కృషి చేస్తానన్నారు. సూక్ష్మస్థాయి పరిశీలన, నైపుణ్యాల పెంపు సారూప్యత ఉన్న విభాగాల సంఘటిత కార్యాచరణ, పరస్పర సహకారాలు, నైపుణ్య అభివృద్ధి అవసరమన్నారు. అన్నిశాఖల అధికారులు, అధ్యాపకులతో చర్చించి స్పష్టమైన ప్రణాళికతో ప్ ంంంద ంక్ ం సాగుతావ ంన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, సీవోఈ ఉపేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అరుణప్రియ, మారం వెంకటరమణారెడ్డి, ప్రేమ్‌సాగర్, సుధారాణి, అధికారి మిర్యాల రమేష్, దోమల రమేష్, అన్నపూర్ణ, రేఖ, రూప, వసంత, మాధురి, సబీనా హెరాల్డ్‌తో పాటు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



కొమ్మకొమ్మకో గిజిగాడి గూడు

వర్షాకాలనికి ముందే పక్షులు తమ గూళ్లను కట్టుకుంటాయి. ఒక్కో పుల్లతో కట్టే ఈ గూళ్లు ప్రకృతి విపత్తులనూ తట్టుకుంటాయి. అయితే పక్షులన్నీ ఒకేచోట ఉండాలనుకున్నాయో ఏయో నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి-వనిపాకలకు వెళ్లే దారిలో ఒక్క తాటిచెట్టుపై 20కి పైగా గూళ్లు కట్టుకున్నాయి.

నల్లగొండ జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపిక

గుర్రంపోడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా వాలీబాల్ జట్టుకు గుర్రంపోడు మండలం పిట్టలగూడెం షైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థి మనోహర్ ఎంపికయ్యాడు. అండర్-17 విభాగంలో నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో శనివారం నిర్వహించిన డివిజన్ స్థాయిపోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఆదివారం నిర్వహించే ఉమ్మడి జిల్లా జట్టు ఎంపికలో పాల్గొననున్నారు. మనోహర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్‌ఫారుఖ్, పీఈటీ శ్రీనులు అభినందించారు.

నేడు కొప్పోలులో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఖోఖో ఎంపికలు

గుర్రంపోడు, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం కొప్పోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా జూనియర్ ఖోఖో బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 18 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణపత్రం, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపిక క్రీడాకారులు మహబూబ్‌నగర్‌లో జరిగే జూనియర్ ఖోఖో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

క్రైం పాయింట్ (Crime point)

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

దేవరకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దైవదర్శనానికి ఈ నెల 14న వెళ్లిన అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. నల్లగొండ దేవరకొండ మండలం వద్యతండాకు చెందిన మాడెం ఇద్దయ్య నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండల పరిధిలో సంచరిస్తుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 14న ద్విచక్ర వాహనంపై శ్రీశైలం వెళ్తున్నానని చెప్పి వెళ్లిన ఇద్దయ్య మున్ననూరు అటవీప్రాంతంలో బైక్, చెప్పులు, సెల్‌ఫోన్ వదిలి అదృశ్యమయ్యాడు. అక్కడ అతడి వస్తువులు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసులకు పిర్యాదు చేయడంతో గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం వంగూరు పోలీసులు ఇద్దయ్యను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇద్దయ్య ఆచూకీ లభించడంతో కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

మద్యానికి బానిసై..

బీబీనగర్, అక్టోబరు 19: మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ రైల్వేస్టేషన్‌లో శనివారం జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఎరుకల మహేశ్(28) అవివాహితుడు. తండ్రి చనిపోవడంతో తల్లితో కలిసి ఉంటున్నాడు. తాగుడుకు బానిసైన మహేశ్ జులాయిగా తిరుగుతు డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో జీవితంపై విరక్తి చెంది బీబీనగర్ రైల్వే స్టేషన్‌లో కదులుతున్న గూడ్స్ రైలు కింద పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్టేషన్ మాస్టర్ సమాచారంతో రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడు మృతి

చింతపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం నెల్వలపల్లి గ్రామ శివారులో ఈ నెల 12న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు శనివారం మృతిచెందాడు. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలం పసునూరు గ్రామానికి చెందిన రాపోతూ సందీప్ (21) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవుల నిమిత్తం అతని స్నేహితులు నెల్వలపల్లిలో ఉంటున్నారు. వారిని కలుసుకొని తిరిగి బైక్‌పై పసునూరుకు వస్తుండగా నెల్వలపల్లి గ్రామశివారులో బైక్ అదుపు తప్పి కింద పడి తలకు గాయమైంది. చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రెండ్ మారింది

(5వ పేజీ తరువాయి)

దుస్తులు మాత్రమే నూతన ట్రెండ్‌ను ఫాలో అయ్యేవారు. ప్రస్తుతం మహిళలకు ధీటుగా అందంగా, ఆకర్షణీయంగా తయారయ్యేందుకు పురుషులు సైతం సెలూన్లను, బ్యూటీ టిప్స్‌ను అనుసరిస్తున్నారు. భిన్నరకాల హెయిర్ స్టైల్స్‌తో పాటు, బేర్ షేపింగ్, హెయిర్‌స్పా, హెయిర్ మల్టీపుల్ కలరింగ్, స్ట్రైకింగ్, హెడ్‌మసాజ్, హెయిర్‌వాష్, టాన్‌ప్యాక్, స్క్రబ్, ఫేషియల్స్, హైడ్రా ఫేషియల్స్, పెడిక్యూర్, మెనీక్యూర్, టాటూస్, వాక్సిన్ వంటి వాటికి సైతం మొగ్గుచూపుతున్నారు. ఆకర్షణీయ రూపం కోసం పురుషులు, ప్రధానంగా యువకులు ప్రాధాన్యం ఇస్తున్నారు.

స్వయం ఉపాధికి చక్కటి మార్గంగా

బ్యూటీపార్లర్లకు గిరాకీ పెరగడంతో బ్యూటీషియన్ కోర్సులు నేర్చుకునే యువతుల సంఖ్య పెరిగింది. పట్టణాల్లో, పెద్ద గ్రామాల్లో బ్యూటీపార్లర్లు నెలకొల్పడం ద్వారా స్థానికులకు అందుబాటులో సేవలందించడంతో పాటు, వాటి నిర్వహణ ద్వారా సదరు యువతులు ఉపాధి కూడా పొందుతున్నారు. మరికొందరు అక్కడే బ్యూటీ ప్రొడక్ట్స్‌ను కూడా విక్రయిస్తున్నారు. పార్లర్ల వద్దనే కాకుండా పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలకు అవుట్‌డోర్‌కు వెళ్లి కూడా సేవలు అందించడం ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో నయా ట్రెండ్ నడుస్తోంది.



బ్యూటీపార్లర్లకు ఆదరణ పెరిగింది



గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం బ్యూటీపార్లర్లకు చాలా ఆదరణ పెరిగింది. 15 ఏళ్ల క్రితం పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లకు వెళ్లేవారు, పెళ్లికూతురు మేకప్‌కి మాత్రమే పార్లర్లకు వచ్చేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఐబ్రోస్ మొదలుకొని ఫేషియల్స్, ఇతర పలు బ్యూటీ సేవల కోసం ఇప్పుడు రెగ్యులర్‌గా వస్తున్నారు. అప్పట్లో రోజుకు ఒకరిద్దరి గిరాకీ వస్తే, ఇప్పుడు ఆ సంఖ్య ఎన్నోరెట్లు పెరిగింది. బ్యూటీపార్లర్ నిర్వహణ ద్వారా మాకు చక్కటి ఉపాధి కలుగుతోంది. నేను మరికొందరికి శిక్షణ కూడా ఇస్తున్నా.

● జ్యోతిరెడ్డి, మీర్‌బాగ్‌కాలనీ, నల్లగొండ

లేటెస్ట్ ట్రెండ్స్‌కి అనుగుణంగా సేవలు



గతంలో హెయిర్ కటింగ్, పెళ్లిళ్లు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో ఫేషియల్‌కే పురుషులు, యువకులు పరిమితమయ్యేవారు. ఇప్పు డు ట్రెండ్ మారింది. బాడీ మసాజ్ మొదలుకొని హెయిర్‌స్పా, హెయిర్‌డ్రై, రకరకాల స్టైల్స్, వాక్సిన్, బేర్, హెడ్‌మసాజ్ వంటి అందంగా కనిపించేందుకు మార్కెట్లో ఏ ట్రెండ్ వస్తే ఆ ట్రెండ్‌ను యూత్ అడుగుతున్నారు. మేం అవసరమైన మేరకు ట్రైనింగ్స్ తీసుకొని ఆ సేవలన్నింటినీ ఇక్కడ కూడా అందిస్తున్నాం. చైన్ కంపెనీలు, ఇతర సర్వీస్ ప్రొవైడర్ల మాదిరిగా మేం కూడా అన్ని సేవలు అందిస్తున్నాం.

● శికిలంభట్ల శివశంకర్, క్లాక్‌టవర్ సెంటర్, నల్లగొండ

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	590
టీఎంసీలు	312.0450
ఎడమకాల్వకు నీటి విడుదల	6,173
కుడికాల్వకు	6,112
విద్యుత్ కేంద్రం ద్వారా	29,597
సాగర్‌కు నీటి రాక	1,79,971
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	1,90,187 క్యూసెక్కులు

- నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.28 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	94,565
నీటి విడుదల	1,36,655

- మేళ్లచెర్వు,(ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.08 అడుగులు
టీఎంసీలు	4.22
ఇన్‌ఫ్లో	1630.54 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	2403.06 క్యూసెక్కులు

- కేతేపల్లి,(ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	20 అడుగులు

- శాలిగౌరారం,(ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
టీఎంసీలు	2.4
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	3770 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	3770 క్యూసెక్కులు

-డిండి,(ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షం

● నేలవాలిన వరి పొలాలు, ● కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం ● పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం రాశులు



భువనగిరిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో రోడ్డుపై వర్షపు నీరు



సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెంలో నేలవాలిన వరి పొలం

భువనగిరి గంజ్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం ఈదురు గాలులు వీచి ఉరుముల, మెరుపులతో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. చేతికొచ్చిన వరి చేలు పలు గ్రామాల్లో నేలకొరిగాయి. యాదాద్రిభువనగిరి జిల్లాలో 32.5 మిల్లీమీటర్ల సగటున వర్షపాతం నమోదైంది. యాదగిరిగుట్ట మండలంలో 32.5మిల్లీమీటర్లు, ఆలేరు 32.0 మిల్లీమీటర్లు, రామన్నపేటలో 19.3 మిల్లీమీటర్లు, మోత్కురులో 17.5 మిల్లీమీటర్లు, భువనగిరిలో 16.8 మిల్లీమీటర్లు, తుర్కపల్లి 0.8 మిల్లీమీటర్లు, మోటకొండూరు 12.0 మిల్లీమీటర్లు, బొమ్మలరామారం 1.0మిల్లీమీటర్లు, పోచంపల్లి 4.3 మిల్లీమీటర్లు, వలిగొండ 3.0 మిల్లీమీటర్లు, ఆత్మకూరు(ఎం)లో 1.5మిల్లీమీటర్లు, అడ్డగూడూరు 2.8 మిల్లీమీటర్లు, గుండాల 1.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాత్రివేళలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ ప్రకటించింది.

యాదగిరిగుట్టలో ఈదురు గాలులతో భారీ వర్షం

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్టలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రజలు సుమారు 40నిమిషాలు పాటు ఎక్కడికక్కడే నిలిచిపోయారు. సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

సూర్యాపేట జిల్లాలో

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లాలో అత్యదికంగా గరిడేపల్లిలో 17.6మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యల్పంగా నడిగూడెంలో 0.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. హుజూర్‌నగర్‌లో 16.5, పాలకీడులో 14.5, నేరేడు చర్లలో 9.6, మట్టంపల్లిలో 8.2, కోదాడ, పెన్‌పహాడ్‌లో 7.0, చిలుకూరులో 6.7, చింతలపాలెంలో 4.7, మేళ్లచెర్వులో 2.4, చివ్వెంలలో 2.2మద్దిరాలలో 1.3, తిరుమ లగిరిలో 1.2, మునగాలలో 0.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో 4.3 మిల్లీమీటర్ల సగటు వర్షంపాతం నమోదైంది.

నేరేడుచర్ల: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి, ఈదురు గాలులకు మేడారం, బక్కయ్యగూడెం, ముకుందాపురం, నేరేడుచర్లలోని పొలాలు నేలవాలాయి. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాజకీయ పార్టీల నాయకులు కోరారు.

కోతకు వచ్చిన పొలాలు నేలవాలి..

ఆత్మకూర్(ఎస్): పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురిసి పంటలు దెబ్బ తిన్నాయి. శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని పూరు గ్రామంలో సుమారు 10ఎకరాలకు పైగా వరి పొలాలు నేలకొరిగాయి. 10రోజుల్లో కోతకు వచ్చిన పంట పొలాలు నేలపాలు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన అవిరె మల్లయ్య వరి పొలం ఈదురుగాలికి నేలకొరిగి ధాన్యం రాలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి అవిరె అప్పయ్య డిమాండ్ చేశారు.

తడిసిన ధాన్యం రాశులు

శాలిగౌరారం: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులు వీచి ఉరుముల, మెరుపులతో గంట పాటు భారీ వర్షం పడింది. వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయ్యాయి. చేతికొచ్చిన వరి చేలు పలు గ్రామాల్లో నేలకొరిగాయి. ఐకేపీ, శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌లో పోసిన ధాన్యం రాశులు తడిసి పోయాయి. ఈ అకాల వర్షంతో ఆరుగాలం కష్టించి పనిచేసిన రైతులకు ఆందోళన కలిగించింది.

కేతేపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి రైతులకు నష్టం వాటిల్లింది. వరికోత యంత్రాల సాయంతో ఇప్పటికే పంట కోసిన రైతులు ధాన్యాన్ని విక్రయానికి ఐకేపీ కేంద్రాలకు తరలించి ఆరబెడుతున్నారు. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి ఐకేపీల్లోని ధాన్యం తడిసిపోయింది. ఆయా కేంద్రాల్లో చేర్చిన రైతులు ఆరబెడుతున్న సుమారు వంద క్వింటాళ్ల ధాన్యం తడిసింది. మరోవైపు పత్తి పంట చేను మీదనే తడిసి ముద్దయ్యింది. 20రోజులుగా ముమ్మరంగా పత్తి తీసే పనులు సాగుతున్నా కూలీల కొరత నెలకొంది. ఈ క్రమంలో కురిసిన వర్షానికి పత్తి చేను మీదనే తడిసి రంగు మారే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నల్లగొండ జిల్లా కేతేపల్లిలో కురుస్తున్న వర్షం

పిడుగుపాటుకు మహిళ మృతి



నాగమణి(ఫైల్)

అడవిదేవులపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు మహిళ మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని బాలెంపల్లి గ్రామ శివారులో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మొల్కచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని బాలాజీతండాకు చెందిన జటావత్ నాగమణి(30) ఉదయం ముగ్గురు మహిళ కూలీలతో కలిసి హరి అనే రైతు మిర్చి తోటలో కలుపు తీయడానికి వెళ్లారు. కాగా సాయంత్రం సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవగా ఆ ప్రదేశంలో ఒక్కసారిగా పిడుగుపడింది. దీంతో జటావత్ నాగమణి అక్కడికక్కడే మృతిచెందింది. మిగితా ముగ్గురు మహిళా కూలీలు స్పృహతప్పి పడిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు నాగమణి తండ్రి రమావత్ మంగ్తా ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. నాగమణికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలెంపల్లి గ్రామంలో పిడుగుపాటుకు గురై మృతిచెందిన జటావత్ నాగమణి మృతదేహాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి తగిన నష్ట పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

నిత్య పూజలు



భువనగిరి అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం నిత్య పూజలు శాస్త్రోక్తంగా సాగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలి పూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామికి, మహామండ

టెలీమెట్రీలను పరిశీలించిన సీడబ్ల్యూసీ సీఈ



ప్రధాన డ్యాం వద్ద సీడబ్ల్యూసీ సీఈ నిత్యనంద

నాగార్జునసాగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద నీటి లెక్కలు పక్కాగా ఉండేందుకు ప్రధాన డ్యాం, కుడి కాల్వల వద్ద ఏర్పాటు చేసిన టెలీమెట్రీ మీటర్లను కేజీబీవో(కృష్ణా, గోదావరి బోర్డు ఆథారిటీ), సీడబ్ల్యూసీ (సెంట్రల్ వాటర్ కమిషన్) సీఈ నిత్యానంద ముఖర్జీ శనివారం పరిశీలించారు. కృష్ణా బేసిన్లలో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టు వద్ద టెలీమెట్రీలను పరిశీలించిన ఆయన శనివారం నాగార్జునసాగర్‌కు వచ్చారు. సాగర్‌లో సీడబ్ల్యూసీ నిర్వహణలో ప్రధాన డ్యాం, కుడి కాల్వ వద్ద ఏర్పాటు చేసిన టెలీమెట్రీలను, ఎస్‌ఈ కార్యాలయంలో వైర్‌లెస్ సిస్టంను పరిశీలించారు. ఆదేవిధంగా మిర్యాలగూడ నీటిపారుదల శాఖ డివిజన్ కార్యాలయాన్ని, హాలియా ఎడమ కాల్వను కూడా ఆయన పరిశీలించారు. ఆయన వెంట సీడబ్ల్యూసీ ఈఈ ధీరజ్, ప్రాజెక్టు జేఈ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

హుజూర్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలోని అమరవరం గ్రామంలో శనివారం జరిగింది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బూర్గుల నాగమణి(46) శనివారం ఉదయం దుస్తులు ఉతికి తీగపై ఆరేస్తుండగా ఇనుప తీగెకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. నాగమణికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పు కట్టలేదని ఇంటికి చెప్పులు, పొరక, చాటలతో తోరణం

● గ్రామంలో దప్పు చాటింపు వేయించిన వ్యక్తి ● పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళ ● ఏడుగురిపై కేసు



ఇంటికి చెప్పు చాట కట్టిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అప్పు తీసుకొని తిరిగి చెల్లించడం లేదని అప్పు తీసుకున్న మహిళా ఇంటికి చెప్పులు, పొరక, చాటలతో తోరణం కట్టాడో వ్యక్తి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని ఆశ్లాతండాలో శనివారం జరిగింది. మండలంలోని అశ్లాంతండాకు చెందిన వాంకుడోత్ కీమా, అనిత దంపతులు అదే గ్రామానికి చెందిన ధరావత్ రంజా వద్ద మూడు సంవత్సరాల క్రితం రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. కొద్ది కాలానికి కీమా అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో బతుకు దెరువు కోసం అనిత హైదరాబాద్‌కు వెళ్లింది. అప్పుడప్పుడు గ్రామానికి వచ్చేది. ఈ క్రమంలో దసరా పండుగకు రెండు రోజులకు ముందుకు గ్రామానికి వచ్చింది. తన డబ్బులు ఇవ్వాలని రంజా అనితను అడిగాడు. ఇవ్వకపోవడంతో రెండు రోజుల క్రితం రంజా కుటుంబ సభ్యులు అనిత ఇంటికి పాత చెప్పులు, పొరక, పాతచాటలను దండగా కూర్చి తోరణంగా కట్టారు. అనిత అప్పటికే హైదరాబాద్‌కు వెళ్లింది. ఆమె వెళ్లిన తర్వాత అంతటితో ఆగకుండా అనిత తమ అప్పు చెల్లించడం లేదని రంజాకు గ్రామంలో ఇకపై ఎవరూ అప్పు ఇవ్వవద్దని శుక్రవారం దప్పు చాటింపు వేయించాడు. ఈ విషయాన్ని గ్రామస్థులు హైదరాబాద్‌లో ఉన్న అనితకు సమాచారం ఇచ్చారు. ఆమె శనివారం గ్రామానికి వచ్చి పోలీసులను ఆశ్రయించింది. తన ఇంటికి చెప్పుల దండలు వేసి ఊర్లో దప్పు చాటింపు చేయడంతో తాను తీవ్ర మనోవేదనకు గురవుతున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. భర్త చనిపోవడంతో బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి బతుకుతున్నానని, కావాలనే తనపై చెడు ప్రచారం చేస్తున్నారని రంజాతో పాటు అతడికి సహకరించి మరో ఏడుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శంకర్‌నాయక్ తెలిపారు.

డబ్బులు తీసుకొని ఇవ్వడం లేదని దంపతుల ఆందోళన

మఠంపల్లి: వడ్డీగా తీసుకున్న డబ్బులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని దంపతులు ఆ వ్యక్తుల ఇళ్ల ఎదుట ధర్నా చేశారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని బక్కమంతులగూడెం శనివారం జరిగింది. బాధితులు గుగులోతు బాలోజీ, గుగులోతు లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రగుట్టతండాకు చెందిన బక్కమంతులగూడెం గ్రామానికి చెందిన బల్సూనూరి రాజా మోహన్‌రెడ్డి, సత్యానారాయణరెడ్డిలు ఎల్ఐసీ నుంచి వచ్చిన రూ.5లక్షల నగదు తీసుకొని వడ్డీ ఇస్తామని చెప్పారని బాధితులు తెలిపారు. వడ్డీతో సహా ఆరు నెలల్లో ఇస్తామని ఏడాదిన్నరగా తిప్పుతూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దిక్కున్న చోట చెప్పుకోవాలని బెదిరిస్తున్నారని, గ్రామ పెద్దలు జోక్యం చేసుకొని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు.

అధికారులు మండల అభివృద్ధికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

అడవిదేవులపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు బాధ్యతగా పనిచేయాలని లేకుంటే బదిలీపై వెళ్లాలని సూచించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని అన్నారు. రెండేళ్లలో దున్నపోతులగండి ప్రాజెక్టు పనులను పూర్తి చేసి మండలంలో ప్రతీ ఎకరాకు సాగునీరు అందించే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డి.దస్రునాయక్, తహసీల్దార్ సురేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రమావత్ బాలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

పేదలకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

త్రిపురారం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. మండలానికి చెందిన 11 కల్యాణలక్ష్మి చెక్కులు, 30 మందికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని అన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది డబ్బులు ఖర్చు చేసుకున్న వారిని ఆదుకోవడం కోసం సీఎం సహాయనిధితో ఊరట కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, అనుముల నర్సిరెడ్డి, వెంకట్‌రెడ్డి, అంకతి సత్యం, బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, అమరేందర్‌రెడ్డి, రవికుమార్, శ్రీను, బాలు, సోమయ్య, ప్రమీల పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతాంగ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లి మండలంలోని ఇనుపాముల, కొండకిందిగూడెం, చెరుకుపల్లి, తుంగతుర్తి, కొప్పోలు, భీమారం, ఉప్పపహాడ్, చీకటిగూడెం, కాసనగోడు, బొప్పారం, గుడివాడ, ఇప్పలగూడెం గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శనివారం డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి, డీఎస్‌వో వూర వెంకటేశ్వర్లు, శాసనమండలి మాజీచైర్మన్ నేతి విద్యాసాగర్‌లతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం వెనుకాడదన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యం సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో డీఎస్‌వో వూర వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో బి. శ్రీనివాసరావు, పీఏసీఎస్ డైరెక్టర్లు గుత్తా మంజుల, చింతం వెంకటేశ్వర్లు, వి.ఇజాక్, కేశయ్య, మాజీ జడ్పీటీసీ కోట మల్లికార్జునరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస యాదవ్, నాయకులు మాధవరెడ్డి, బొజ్జ సుందర్, సీటీ.ప్రసాద్, బడుగుల నరేందర్, కె.మహేందర్‌రెడ్డి, కోట పుల్లయ్య, ప్రవీణ్, బి.రవీందర్, ముత్తమ్మ, మంగమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


చెర్కుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం, వెంకట్‌రెడ్డి

నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు

డివిజన్ వ్యవసాయాధికారి వెంకట రవీందర్

హాలియా, అక్టోబరు 19: ఫర్టిలైజర్స్ యజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని హాలియా డివిజన్ వ్యవసాయాధికారి వెంకట రవీందర్, అనుముల మండల వ్యవసాయాధికారి సరిత అన్నారు. శనివారం హాలియాలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్స్ యొక్క స్టాకు వివరాలు, రిజిస్టర్లు, పీసీలు, ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్రయ విక్రయాలు నిర్వహించాలని, రైతులకు బిల్లులు తప్పకుండా ఇవ్వాలని, స్టాక్ వివరాలను మెయిన్‌టెన్ చేయాలని డీలర్లకు సూచించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట వ్యవసాయ సిబ్బంది, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

వేధింపులకు పాల్పడుతున్న హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన నిర్వాహకులను వేధింపులకు గురిచేస్తున్న చండూరు హైస్కూల్ హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో బాధిత మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి శనివారం డీఈవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం హెచ్‌ఎం మధ్యాహ్న భోజన కార్మికులను వేధించడం తగదన్నారు. 400 మంది విద్యార్థులు ఉంటే నెలకు రూ.1 లక్ష చొప్పున ఖర్చు వస్తున్నా మహిళా సంఘం ఖాతాలో జమ చేయకుండా అందులో సగం సొంత ఖర్చులకు వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకుల నవదీప్, శేఖర్, కిరణ్, జగదీష్, మనిమద్దె యాదయ్య, ఆలంపల్లి కొండన్న, బాకీ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

దేవరకొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గీత పనివారల సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కుంభం జయరాములు కోరారు. దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ గీత పనివారల సంఘం వార్షికోత్సవ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1957 వరంగల్ జిల్లా గార్లలో గీత పనివారల సంఘం ఏర్పడిందన్నారు. చెట్టు పైనుంచి పడి మృతి చెందిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, పింఛన్, వన పెంపకానికి భూమి, కల్లుగీత వృత్తి ఆధునికీకరణకు ప్రభుత్వాలతో పోరాటాలు చేసిన ఘనత ధర్మభిక్షానికి దక్కిందన్నారు. వృత్తిని రక్షించుకునేందుకు గీత పనివారల సంఘం ఎన్నో పోరాటాలు చేసిందని తెలిపారు. గీత పనివారల సంఘం వార్షికోత్సవ సభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గీత పనివారల సంఘం నాయకులు చింతపల్లి పుల్లయ్య, గోవర్ధన్, మహేష్, రాములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'చిరుమర్తి ఆరోపణలు సరికాదు'

కేతేపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కాంగ్రెస్ పాలన, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంపై పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మాజీ ఎంపీపీ పి.శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జ సుందర్, గుత్తా మాధవరెడ్డి, జె.వెంకటనర్సయ్యయాదవ్ అన్నారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి, ఆయన అనుచరులపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. లింగయ్య ఐదేళ్ల కాలంలో తనకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిని డీటీసీకి పంపించి పోలీసులతో చిత్రహింసలు పెట్టించారని ఆరోపించారు. కేతేపల్లిలోని ఆయన ప్రధాన అనుచరులు చెరువులను కబ్జా చేయడం, రౌడీ రాజకీయాలు చేయడాన్ని ప్రజలు మరవలేదన్నారు. పోలీస్‌స్టేషన్లలో పంచాయతీలు పెట్టి దౌర్జన్యాలకు పాల్పడిన నీ అనుచరగణం అకృత్యాలు మండల ప్రజలు ఎలా మరిచిపోతారని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మట్టి సాల్మన్, ఎడ్ల ప్రవీణ్, కోట పుల్లయ్య, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహానికి వార్షికోత్సవ పూజలు

శాలిగౌరారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం ప్రాజెక్టు సమీపంలోని సీతారామ చంద్రస్వామి ఆలయం ఆవరణలో గత సంవత్సరం ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహానికి వార్షికోత్సవ ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులతో నిర్వహించిన యజ్ఞం, హోమం, అభిషేకాలు ప్రత్యేక పూజల్లో విగ్రహదాత బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, ఇందిర దంపతులు, కుమారుడు చాడ చరిత్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శేషం రత్నమాచార్యులు, జగన్మోహనాచార్యులు, రామచంద్రాచార్యులు, రఘునందనచార్యులు, మాజీ ఎంపీటీసీ వడ్లకొండ బిక్షంగౌడ్, నాయకులు కూరం వెంకన్న, వాడపల్లి జగన్ భిక్షులు పాల్గొన్నారు.


ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కిషన్‌రెడ్డి దంపతులు

మండలస్వామి మృతి తెలుగు సాహిత్యానికి తీరనిలోటు

నల్లగొండకల్చరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, కథకుడు, సాహిత్య విమర్శకుడు డాక్టర్ మండల స్వామి ఆకస్మిక మృతి తెలుగు సాహిత్యానికి తీరనిలోటని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ తండు కృష్ణకౌండిన్య అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన మండలి స్వామి సంతాప కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వామి సాహిత్యంలోనూ, విద్యరంగంలోనూ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సృజన సాహితీ సంస్థ అధ్యక్షుడు పెరమాళ్ల ఆనంద్ మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన మండల స్వామి అనేక ప్రక్రియల్లో రచన చేశారని, ఆయన సాహిత్యం వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. స్వామి మృతికి పలువురు సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు సాగర్ల సత్తయ్య, బండారు శంకర్, రామకృష్ణ, మునాసు వెంకట్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, అంజయ్య, వెంకన్న, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

హఫీజుద్దీన్‌కు అక్కినేని సినీఅవార్డు

కనగల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కనగల్ గ్రామానికి చెందిన మాజీ కోఆప్షన్ సభ్యుడు, గాయకుడు ఎండీ హఫీజుద్దీన్ అక్కినేని సినీ అవార్డును అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో అక్కినేని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సినీ దర్శకుడు, నిర్మాత శ్రీకాంత్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్నగౌడ్, ఇందిర ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఇందిర, డాక్టర్ విల్సన్ అవార్డును అందజేశారు. అనంతరం హఫీజుద్దీన్ మాట్లాడుతూ అక్కినేని అవార్డును తీసుకోవటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళారత్న త్రినాథ్‌రావు, దీపికరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

మర్రిగూడ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖుదాభక్షపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి విధుల నిర్వహణలో నిధుల అక్రమాలపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీవో రవికుమార్ ఖుదాభక్షపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఆ గ్రామపంచాయతీకి చెందిన కొంతమంది వ్యక్తులు కార్యదర్శి పార్వతిపై విచారణ నిర్వహించాలని సెప్టెంబరు 25వ తేదీన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీపీవోకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేయగా ఈ నెల 7వ తేదీన కార్యదర్శిపై ఇచ్చిన అభియోగాలపై విచారణ నిర్వహించాలని ఎంపీవోను ఆదేశించారు. డీపీవో ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుదారులు ఇచ్చిన అభియోగాలపై విచారణ నిర్వహించారు. గ్రామస్థులు, పంచాయతీ కార్యదర్శి నుంచి వివరాలు తెలుసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రజలు ఇచ్చిన అభియోగాలపై విచారణ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ నివేదికను రెండు, మూడు రోజుల్లో డీపీవోకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో మున్నయ్య, గ్రామస్థులు ఉన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

● మాజీ ఎమ్మెల్యే లింగయ్య

కట్టంగూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరిగేంత వరకు బీఆర్‌ఎస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం బీఆర్‌ఎస్ కార్యకర్తలతో పాటు రుణమాఫీ కాని రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ 10నెలల కాలం పూర్తికాక ముందే ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని అన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాం, నాయకులు పోగుల నర్సింహ, పెద్ది బాలనర్సింహ, వడ్డె సైదిరెడ్డి, బ్లూస్టార్ సైదిరెడ్డి, గుర్రం సైదులు, దాసరి సంజయ్, జానీ పాషా, పనస సైదులు, అంతటి శ్రీను, నకిరేకంటి నర్సింహ, రెడ్డిపల్లి మనోహర్, పిన్నపురెడ్డి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కట్టంగూరులో ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మునుగోడు, అక్టోబరు 19 (ఆంధ్యజ్యోతి): మునుగోడు మండల పరిధిలోని వివిధ గ్రామాల రహదారుల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కృషి పట్ల పలువురు కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. గ్రామాల అభివృద్ధి కోసం నిధులు మంజూరీ చేయించటం అభినందనీయమని, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగెస్ నాయకులు బూడిద లింగయ్యయాదవ్, పాల్వాయి జితేందర్‌రెడ్డి, భీమనపల్లి సైదులు, జిట్టగోని యాదయ్య, ఆరేళ్ల సైదులు, సాగర్ల లింగస్వామి, అన్వర్, పందుల లక్ష్మణ్, ప్రభాకర్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భవనాలను సంఘాలకు అప్పగించాలి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మించిన బీసీ, ఎస్టీ, ఎస్సీ భవనాలను సంఘాలకు వెంటనే అప్పగించాలని కోరుతూ ఆయా సంఘాల నేతలు మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు వస్కుల మట్టయ్య మాట్లాడుతూ కట్టాలా... వద్దా... అనుకుంటూ నిర్మించిన భవనాలను అప్పగించకపోవడం సరికాదన్నారు. నిర్మాణ బాధ్యతలు నిర్వహించిన కాంట్రాక్టరు బిల్లుల చెల్లింపు జరగలేదని తాళాలు వేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ భవనాలను వెంటనే సంఘాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘాల నేతలు తిరుమలగిరి అంజి, చేగొండి మురళీధర్, పోతుగంటి కాశీ, గోపాల్‌దాసు, ఇమానియేల్, ఉపేందర్ పాల్గొన్నారు.

మహిళల సమస్యను పరిష్కరించాలి

వేములపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల సమస్యలను పరిష్కరించాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈనెల 21, 22, 23 తేదీల్లో జరిగే ఐద్వా నాలుగవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలోనే 16 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా అందించాలని ఆమె అన్నారు. ఈ మహాసభల్లో మహిళా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి వాటి పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు పొదిల లక్ష్మి, కార్యదర్శి అనిరెడ్డి మాధవి, శీలం పద్మ, పెంటమల్ల సుకన్య, మంగమ్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

● నకిరేకల్: ఐద్వా 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు చిన్నబోయిన నాగమణి పిలుపునిచ్చారు. నకిరేకల్‌లో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంకి మనెమ్మ, పన్నాల శశికళ, సోమమ్మ, రేణుక, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.



వేములపల్లి : మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

టీచర్ల సమస్యల పరిష్కారం పీఆర్టీయూటీతోనే సాధ్యం

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమవుతుందని టీపీఆర్టీయూ మండల అధ్యక్షుడు కేతావత్ మూనా అన్నారు. శనివారం ఉమ్మడి మండలంలోని పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగలి శ్రీపాల్‌రెడ్డికి మద్దతూ కోరుతూ అజ్మాపురం, గుడిపల్లి జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు పత్రాలను అందజేసి మాట్లాడారు. అంతేకాకుండా ఉమ్మడి మండలంలో కొత్తగా ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన వారికి పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రెడ్డిమణి అనిల్‌కుమార్, గుడిపల్లి జడ్పీ హెచ్‌ఎం శ్రీనయ్య, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, సుదర్శన్, రవికుమార్, సైదులు, శ్రీలక్ష్మి, నర్సయ్య, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఓటరు నమోదు పత్రాలను అందజేస్తున్న నాయకులు

అండర్ పాసింగ్‌లో లైట్లు అమర్చాలి

నార్కట్‌పల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిగూడెం ఫ్లైఓవర్ అండర్ పాసింగ్ లోపల లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన యువకులు కోరుతున్నారు. రాత్రి సమయంలో చిమ్మచీకటితో ఏమీ కనపడకుండా రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. హైస్కూల్‌కు కొద్దిదూరంలో ఉన్న అండర్ పాసింగ్‌లో రాత్రివేళ చిమ్మ చీకట్లు కమ్ముకుంటున్నాయని అన్నారు. అంతేకాక అండర్ పాస్‌లోకి విషపూరిత కీటకాలు, కుక్కలతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

దాడులు చేయడం సరికాదు

చింతపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో హిందువులపై పోలీసులు దాడులు చేయడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్ అన్నారు. అమాయక ప్రజలపై ఇలాంటి దాడులు చేయడం విడ్డూరమని అన్నారు.

హామీలు అమలు చేయాలి

చింతపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఉడుకుంట్ల రాములు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ రైతులకు అమలుచేయకుండా రైతు భరోసా నేటికి మంజూరు కాకపోవడంతో రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం


హాలియా, అక్టోబరు 19: హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు వీరమళ్ల శ్రీనివాస్, చిట్టిపోలు యశ్వంత్‌లను హాలియా సాయిమందిరం కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాయిమందిరం అధ్యక్షుడు తేలపోలు శేఖర్, మిల్లర్ల గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, మిట్టపల్లి వాసులు, రేపాల వెంకన్న, సంతోష్, ప్రభాకర్, సురేష్, అరవింద్, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

దేవరకొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఇందిర మహిళ చైతన్య మండలి నిర్వాహకురాలు లోకసాని మన్మధరెడ్డి అన్నారు. శనివారం ఇందిర మహిళ చైతన్య మండలి ఆధ్వర్యంలో కస్తూర్బా బాలికల పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు, విద్యార్థినులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. లైంగిక దాడులు అరికట్టడానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మహిళ చైతన్య మండలి సభ్యులు దామోదర్‌రెడ్డి, సావిత్రి, నిర్మల, విద్యార్థినులు పాల్గొన్నారు.

డిండి మండలవాసికి డాక్టరేట్

డిండి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డిండి మండలం జేత్యతండాకు చెందిన సపావట్ రాజు ఉత్తరప్రదేశ్‌లోని మోనాడ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'భారతీయ మార్కెట్, భారతీయ ఆర్థిక సంస్థల్లో ఆర్థిక అభివృద్ధి యొక్క వ్యూహాత్మక విశ్లేషణ' అనే అంశంపై ప్రొఫెసర్ అశుమాన్‌శర్మ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. రాజు ప్రస్తుతం నల్లగొండ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. రాజు విద్యాభ్యాసమంతా ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పూర్తి చేశాడు. డాక్టరేట్ పొందడంపై గ్రామస్థులు రాజుకు అభినందనలు తెలిపారు.


సపావట్ రాజు

అధ్యాపకులను నియమించాలి

హాలియా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మ్యాథ్స్, బొటనీ అధ్యాపకులను వెంటనే నియమించాలని ఎస్‌ఎఫ్‌ఐ సాగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్ కోరారు.

జిల్లాస్థాయి క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్ అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-14, అండర్-23 జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని మేఖల అభినవ్ స్టేడియంలో ఈ నెల 23వ తేదీన ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీనుద్దీన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ, ఆధార్ కార్డు, సొంత క్రికెట్ కిట్‌తో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 9885717996 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.


త్రివేణి


యశ్వంత్

కబడ్డీ పోటీలకు ఎంపికైన వల్లాల విద్యార్థులు

శాలిగౌరారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, 17 విభాగం కబడ్డీ పోటీలు నల్లగొండలో నిర్వహించారు. ఈ పోటీల్లో శాలిగౌరారం మండలం వల్లాలలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి నల్లగొండ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అండర్ 17 బాలికల విభాగంలో ముత్యపోతుల త్రివేణి, అండర్ 14 కబడ్డీ విభాగంలో ఉయ్యాల స్వాతి, అండర్ 14 విభాగంలో రాచకొండ యశ్వంత్ మంచి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకి ఎంపికైనట్లు పాఠశాల పీడీ బొడ్డు మల్లేష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీడీ మల్లేష్‌ను ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అడవిదేవులపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అడవిదేవులపల్లి సబ్‌స్టేషన్‌లో సత్రశాల ఫీడర్ కోసం కొత్త బ్రేకర్ ఏర్పాటు చేయనున్నందున ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఎల్.శ్రీను తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అడవిదేవులపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని అడవిదేవులపల్లి, ఉల్సాయిపాలెం, ముదిమాణిక్యం, గోన్యాతండా, చాంప్లా, వస్రాంతండా, జీలకరకుంటతండా, హాముతండా, తాటిచెట్టుతండా, వీర్లపాలెం గ్రామాలకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

22న తైక్వాండో, కబడ్డీ పోటీలు

నల్లగొండ అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంజీయూలో ఈ నెల 22, 23 తేదీల్లో అంతర్ విశ్వవిద్యాలయ తైక్వాండో, కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ హరీష్‌కుమార్ తెలిపారు. 17 నుంచి 25 సంవత్సరాలలోపు డిగ్రీ, పీజీ విద్యార్థులు అర్హులని తెలిపారు. 22న తైక్వాండో, 23న కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.

వాహనాల బ్యాటరీల చోరీ

మర్రిగూడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి పలు వాహనాలకు సంబంధించిన బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. శుక్రవారం రాత్రి మండలంలోని సరంపేట, రాంరెడ్డిపల్లి, రాజుపేటతండా, ఎరుగండ్లపల్లి గ్రామాల్లో టిప్పర్, ట్రాక్టర్లకు సంబంధించిన బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. శనివారం తెల్లవారుజామున వాహనదారుల యజమానులు వాహనాలను పరిశీలించగా బ్యాటరీలు లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు టిప్పర్ యజమాని రంగినేని హరి ఎస్‌ఐ రంగారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.